సాక్షి
ములుగు
బుధవారం । 26 ఏప్రిల్ । 2023



ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పాటుకు కేసీఆర్ కుట్ర

కోట్లాడి, సాధించుకున్న తెలంగాణలో ఫ్యూడల్ వ్యవస్థను పునర్నిర్మించేలా సీఎం కుట్ర చేస్తున్నాడని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. - 8లో▸



కనిపించని ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం

హనుమకొండ, వరంగల్ జిల్లాలో విద్యుత్ ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం ఏ మాత్రం కనిపించ లేదు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0^0 / 23.0^0

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

ఏటూరునాగారం: 2023–24 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవెలెబుల్ స్కీం కింద హైదరాబాద్ బేగంపేట, రామంతపూర్ పబ్లిక్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ప్రవేశం కోసం ములుగు, జయశంకర్ భూపాలపల్లిలోని అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు జిల్లాల్లో ఆరు సీట్లు (డేస్కాలర్) కేటాయించినట్లు ఇందులో మూడు బాలికలు, మూడు బాలురులకు కేటాయించినట్లు తెలిపారు. గిరిజన తెగల వారీగా సీట్లు కేటాయించినట్లు చెప్పారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 29వ తేదీలోపు ఏటూరునాగారం డీటీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మే 3న ఐటీడీఏలో లక్కీడిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక ఉంటుందన్నారు.

పంటలను పరిశీలించిన డీఏఓ



వెంకటాపురం (ఎం): మండలంలోని పట్వారిపల్లెలో వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి గౌస్ హైదర్ పరిశీలించారు. నష్టపోయిన పంటలను బుధవారం నుంచి పరిశీలించాలని ఏఈఓలను ఆదేశించారు. నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీపాల్, ఏఓలు సంతోష్, కల్యాణి, సర్పంచ్ చెన్నోజు సూర్యనారాయణ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



ములుగు రూరల్: బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని ఆపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ సారథ్యంలో ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు గద్దెదించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు గాజుల కృష్ణ, నగరపు రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బలరాం, తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, వెంకటసురేష్, ఉత్తమ్‌కుమార్, తాటి కృష్ణ, భూక్య రాజునాయక్, భూక్య జవహర్‌లాల్, భిక్షపతి, నరేష్, జనార్దన్, వాసుదేవరెడ్డి, సాంబశివరెడ్డి, రవీందర్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



ములుగు: ఓటు లేని వారు ఓటును నమోదు చేసుకోవాలని ఆర్డీఓ రమాదేవి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో పలు పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ములుగు నియోజకవర్గంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లందరూ తమ ఓటును బూత్ లెవల్ అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి తహసీల్దార్ వద్దకు వెళ్లి పరిశీలించుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎలక్షన్ డీటీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

భూసేకరణపై కలెక్టర్ సమీక్ష



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్టు ప్రాజెక్ట్ 2, 3 భూ సేకరణపై కలెక్టర్ భవేష్‌మిశ్రా సింగరేణి, రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశానికి సింగరేణి డైరెక్టర్ బలరాం హాజరయ్యారు. ఓపెన్‌కాస్టుల్లో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను కొనసాగించేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవతం చేయాలని సింగరేణి డైరెక్టర్ కలెక్టర్‌ను కోరారు. రెవెన్యూ అధికారులు ఇంకా మిగులు భూ సేకరణను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జీఎం శ్రీనివాసరావు, జేసీ స్వర్ణలత, ఆర్డీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తహీనత సమస్య..

ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష స్పందన

- గతనెల 8న జిల్లాలో ప్రారంభం
- మహిళల ఆరోగ్యమే లక్ష్యం

ఏటూరునాగారం: గతనెల 8వ తేదీన జిల్లాలో చేపట్టిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఏటూరునాగారం మండలం రొయ్యూర్ పీహెచ్‌సీ పరిధి ఆకులవారిఘణపురం 3 సబ్ సెంటర్, వెంకటాపురం(కె) మండలంలోని ఎదిర ఆస్పత్రిలో మహిళలకు పరీక్షలు చేస్తున్నారు. అత్యధికంగా రక్తహీనతతో మహిళలు బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తిస్తున్నారు. రెండు సెంటర్లలో 8 రకాల పరీక్షలు, అదనంగా మరో మూడు పరీక్షలను చేస్తున్నారు.

జిల్లాలో 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 36 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఏటూరునాగారం మండలంలో ఒకటి, వెంకటాపురం(కె) మండలంలో ఒకటి ఎంపిక చేసి పైలెట్‌గా గుర్తించి అక్కడ ఆరోగ్య మహిళ క్లినిక్‌లను ప్రారంభించారు. ఆరోగ్యంగా మహిళలు ఉండాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని రూపకల్పన చేశారు. ప్రతి మంగళవారం ఆయా ప్రాంతాల్లో మహిళలకు పరీక్షలు చేస్తున్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారే అధికంగా వస్తున్నారు. మహిళలకు ఎలాంటి సమస్య ఉన్నాయని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ ప్రతి మహిళకు ఒక ఐడీని కేటాయిస్తున్నారు. దీనివల్ల ఐడీ నంబర్ ఎంటర్ చేస్తే వారికి ఉన్న ఆరోగ్య రుగ్మతలు వెంటనే తెలుస్తాయి. చికిత్సలు, శస్త్ర చికిత్సలను సులభంగా చేసే అవకాశాలు ఉన్నాయి. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గోప్యంగా ఉంచడంతో వారికి ఉన్న వ్యాధి ముదిరి మృత్యువాత పడుతున్నారని గతంలో చేపట్టిన సర్వే ఆధారంగా తెలిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టింది.



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

పరీక్షల వివరాలు

జిల్లాలోని ఏటూరునాగారం, ఎదిర సెంటర్లలో 760 మంది రిజిస్ట్రేషన్ అయ్యారు. పరీక్షలు చేస్తుండడంతో నలుగురికి క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. ఒక్కో మహిళకు 8రకాల పరీక్షలు చేయడం వల్ల వ్యాధులు బయటపడ్డాయి.

90 రెఫర్..

ఇప్పటి వరకు రెండు కేంద్రాల్లో రక్తహీనతతో బాధపడుతున్న 90మందిని మెరుగైన చికిత్స కోసం వైద్యులు రెఫర్ చేశారు. 7గ్రాములు రక్తం ఉన్న మహిళలు , 7 -9 వరకు ఉన్నవారు, 10 గ్రామాలున్నవారు ఉన్నారు.

వ్యాధులు	వ్యాధిగ్రస్తుల సంఖ్య
గర్భాశయ ముఖద్వార సమస్యలు	192
రొమ్ము సమస్యలు	466
నోటి క్యాన్సర్	471
నరాల సమస్య	156
మూత్రనాళ సమస్యలు	10
మెనోపాజ్ సమస్యలు	139
నెలసరి సమస్యలు	111
సుఖవ్యాధులు	42
బరువు సమస్యలు	151
రక్తహీనత సమస్యలు	817

సద్వినియోగం చేసుకోవాలి..



జిల్లాలో రెండు సెంటర్లలో ఆరోగ్య మహిళ క్లినిక్‌లు చేపట్టాం. మహిళలు ఈ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి. ఉచితంగా పరీక్షలు చేయడంతోపాటు మందులు, ఇతర శస్త్ర చికిత్సలకు కూడా ప్రభుత్వం సాయం చేస్తోంది. మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టింది.

\- అల్లెం అప్పయ్య, జిల్లా వైద్యాధికారి

పరీక్షలు చేయించుకోవాలి..



ఆరోగ్య మహిళ క్లినిక్ ద్వారా చేపట్టే పరీక్షలను అందరు మహిళలు చేయించుకోవాలి. ఎవరు కూడా నిర్లక్ష్యం చేయొద్దు. మన ఆరోగ్య సమస్యలను మనమే పరిష్కరించుకోవాలి. మహిళలు కదిలి వస్తే వారి ఆరోగ్య స్థితిగతులు బాగుపడి ఆరోగ్యంగా ఉంటారు.

\- గుడిమెట్ల కనకతార, 5వ వార్డు సభ్యురాలు ఏటూరునాగారం

మలేరియాను నిర్మూలించాలి



అవగాహన ర్యాలీ తీస్తున్న అధికారులు



కంటివెలుగును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

డీఎంహెచ్‌ఓ అప్పయ్య

కన్నాయిగూడెం: మలేరియా వ్యాధి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌ఓ అప్పయ్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వైద్యాధికారి అభినవ్ ఆధ్వర్యంలో మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ములుగు డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికిరణ్ హాజరై మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించి మానవ హారం ఏర్పాటు చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ మలేరియా వ్యాధి సోకకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. మలేరియా నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో పేద ప్రజలకు సేవ చేయడంలో ఉన్న ఆనందం మరెక్కడా ఉండదని చెప్పారు. జిల్లాలో కన్నాయిగూడెం ఏజెన్సీ మండలమని ఇక్కడి ప్రజలు ప్రభుత్వ వైద్యంపై ఆధారపడుతారన్నారు. అనంతరం వైద్యబృందంతో కలిసి కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కంటివెలుగు మరో క్యాంపును లక్ష్మీపురంలో సర్పంచ్ ఉమామహేశ్వరితో కలిసి ప్రారంభించారు. అనంతరం పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు వసతులు కల్పించాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిమిషా, ప్రణీత, మౌనిక, కమ్యూనిటీ హెల్త్ అధికారి దుర్గారావు, తిరుపతి రెడ్డి, సంపత్, భాస్కర్, సబ్ యూనిట్ అధికారి నర్సింహారావు, హెల్త్ అసిస్టెంట్లు లక్ష్మణ్, ఓంప్రకాశ్, భాస్కర్ పాల్గొన్నారు.

గొత్తికోయ మహిళకు ఒకే కాన్పులో ముగ్గురు ఆడపిల్లలు

- ఒకరు మృతి.. ఇద్దరు పిల్లలు, తల్లి క్షేమం

ఎస్ఎస్‌తాడ్వాయి: గొత్తికోయ మహిళకు కాన్పులో ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. అందులో ఒకరు మరణించగా, ఇద్దరు పిల్లలు, తల్లి ఆరోగ్యంగా ఉన్నారు. ఈ ఘటన ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని గంగారం గ్రామపంచాయతీ పరిధి గొత్తికోయ గూడేనికి చెందిన మడకం గంగమ్మకు మంగళవారం పురిటి నొప్పుల రావడంతో బంధువులు తాడ్వాయి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారి చిరంజీవి, స్టాఫ్ నర్సు ప్రశాంతి సాధారణ డెలివరీ చేయగా ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. ముగ్గురిలో ఒకరు తక్కువ బరువు ఉండడంతో మృతి చెందింది. తల్లి, ఇద్దరు పిల్లలు క్షేమంగా ఉన్నట్లు వైద్యాధికారి చిరంజీవి తెలిపారు. మెరుగైన వైద్య చికిత్స కోసం పిల్లలను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ కాన్పులో ముగ్గురు కవలలు జన్మించడం అరుదైనదిగా వైద్యులు అభిప్రాయపడుతున్నారు. గొత్తికోయ మహిళకు సాధారణ డెలివరీ చేసిన వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ అప్పయ్య అభినందించారు. తల్లి, పిల్లల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.



శిశువులు

నాణ్యతతో ఉత్పత్తి చేయాలి

ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: స్థానికంగా తయారు చేస్తున్న డ్రైమిక్స్ యూనిట్‌లో జోహర్ మిల్, స్వీట్ మిల్ పదార్థాలు నాణ్యతతో కూడిన ఉత్పత్తి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని డ్రైమిక్స్ యూనిట్‌ను సందర్శించి స్వయం కృషి సభ్యులతో ఆయన మాట్లాడారు. స్యామ్ మ్యామ్ న్యూట్రిషన్ కిట్‌ల ప్యాకింగ్ ప్రక్రియ తయారీని పరిశీలించారు. న్యూట్రిషన్ కిట్‌ల కోసం ఉపయోగించే పదార్థాలు, న్యూట్రిషన్ కిట్‌ల తయారీకి అందుబాటులో ఉన్న ముడిసరుకులపై స్వయం కృషి జేఎల్‌జీ గ్రూప్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. యంత్రాల లభ్యత, పనితీరు ఎలా ఉందని ఆరా తీశారు. నిబంధనలు పాటిస్తూ తయారు చేయాలన్నారు. అనంతరం గురుకులం బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ లెక్చరర్ల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది ఎంత మంది అందుబాటులో ఉన్నారని, క్రమం తప్పకుండా హాజరవుతున్నారా లేదా ఏటూరునాగారంలో ఉంటున్నారా అని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మౌనికను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి విద్యార్థుల కొరతపై ఆరాతీయగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రశ్నించారు. కొంతమంది విద్యార్థులు ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్‌లో ఉన్నారని, మరికొంతమంది విద్యార్థులు ఆరోగ్య సమస్యల కారణంగా హాజరుకావడం లేదని ఆమె పీఓకు వివరించారు. రిజిస్టర్ నిర్వహణను తనిఖీ చేశారు. బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లను తనిఖీ చేశారు.



డ్రైమిక్స్ యూనిట్‌లో తయారైన న్యూట్రిషన్‌ను పరిశీలిస్తున్న పీఓ అంకిత్

వ్యాధులపై అవగాహన కల్పించాలి

అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఏటూరునాగారం: మహిళలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం 3 సబ్ సెంటర్‌లో చేపట్టిన ఆరోగ్య మహిళ క్లినిక్ పరీక్షలను ఆమె పరిశీలించారు. మంగళవారం చేపడుతున్న పరీక్షలకు ఎంతమంది వస్తున్నారని ఆరా తీశారు. ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్లు, సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

బిల్ట్ కార్మికుల నిరాహార దీక్ష

- ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- బిల్ట్ జేఏసీ నాయకులు

మంగపేట: బిల్ట్ సమస్యపై ఈనెల 12న ఎన్‌సీఎల్‌టీ కోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా ఏపీఆర్ ఆదర్శ వర్కర్స్ యూనియన్, జేఏసీ ఆధ్వర్యంలో బిల్ట్ కార్మికులు ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట మంగళవారం ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడారు. 2014లో బిల్ట్ మూతపడ్డప్పటి నుంచి యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. నాయకులు సైతం వారి స్వార్థ రాజకీయాల కోసం కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపించారన్నారు. ఎన్నికల సమయంలో బిల్ట్ సమస్యను పావుగా వాడుకోవడం నాయకులకు అలవాటుగా మారిందన్నారు. బిల్టు సమస్యను ఎన్‌సీఎల్‌టి కోర్టు(దివాలా కోర్టు) ఆరు నెలల్లో పరిష్కరించాల్సి ఉండగా 39 నెలల వరకు కాలయాపన చేసిందని ఆరోపించారు. ఈనెల 12న ఇచ్చిన తీర్పు పూర్తి అన్యాయమన్నారు. విషయంపై తాము ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమానికి ముందు కార్మిక సంఘాల నాయకులు డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ ఆదర్శ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటాచారి, జేఏసీ నాయకులు బొక్క బాబూరావు, గుల్లగట్టు విజయరావు, బదావతు నర్సయ్య, పీఎఫ్ కార్మికులు కాసుల అశోక్, భద్రయ్య, సురేష్, లింగంపెల్లి శ్రీనివాస్, మునిగాల వెంకటేశ్వర్లు, పప్పు వెంకట్ రెడ్డి, పెద్ది నర్సింహారావు పాల్గొన్నారు.



నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

తట్టెడు మట్టి పోయించారా..



ప్లీనరీలో నృత్యం చేస్తున్న మంత్రి సత్యవతి, జెడ్పీ చైర్మన్ జగదీశ్



ర్యాలీగా వస్తున్న నాయకులు

- బలం...బలగం బీఆర్ఎస్ పార్టీకి ఉంది
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్

ములుగు: ములుగు ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నాయకులు తట్టెడు మట్టి అయినా పోయించారా.. బలం బలగం బీఆర్ఎస్ పార్టీకి ఉందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని లీలాగార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి ప్లీనరీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై పార్టీ జెండా ఆవిష్కరించారు. తెలంగాణ తల్లికి, అమరవీరుల స్తూపానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. సమావేశంలో 12 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన దళిత గిరిజనులకు ఒక స్వర్ణ యుగమన్నారు. ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అని చెప్పారు. ఒక్క పిలుపుతో నియోజకవర్గ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలతో కేసీఆర్ బలం బలగం ఏంటో అందరికీ అర్థమైందని తెలిపారు. ఇక్కడ గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కేవలం ఆర్భాటమే తప్ప.. ఏ ఒక్క పనిచేయలేదని అన్నారు. కేసీఆర్‌ను విమర్శించే సన్నాసులు రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు.. బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో అమలవుతున్నాయా చూడాలన్నారు. త్వరలో ములుగు జిల్లాలో 3వేల మందికి గృహ లక్ష్మి పథకం కింద మూడు లక్షలు అందిస్తామని చెప్పారు. 1100మందికి దళిత బంధు ద్వారా ఆర్థిక సహాయం రాబోతుందన్నారు. జిల్లాలో గిరిజన యూనివర్సిటీతో పాటు ప్రపంచంలోని అతిపెద్ద గిరిజన పండుగ సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయస్థాయి గుర్తింపు ఇవ్వాలని కోరుతూ కేంద్రానికి ఈసభ వేదికగా తీర్మానం చేసి పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, ఆత్మీయ సమ్మేళన పరిశీలకులు అరికెల నర్సారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవిందునాయక్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మండలాల అధ్యక్షులు బాదం ప్రవీణ్, రమణారెడ్డి, సాయి కుమార్,మల్లయ్య, సునీల్ కుమార్,సుబ్బుల సమ్మయ్య, కుడుముల లక్ష్మీనారాయణ,వేణు యాదవ్, యర్ప సూరయ్య ,సీనియర్ నాయకులు మల్క రమేష్, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

గడ్చిరోలి ఎంపీ ప్రత్యేక పూజలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామిని మహారాష్ట్రలోని గడ్చిరోలి ఎంపీ అశోక్‌నేతే దర్శించుకున్నారు. మంగళవారం ఆయన ఆలయ రాజ గోపురం వద్దకు రాగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ మర్యాదపూర్వక స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ఆయనను ధర్మకర్తలు అడప సమ్మయ్య, కామిడి రాంరెడ్డి శాలువాతో సన్మానించారు. అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు.

యునెస్కో గుర్తింపుతో రామప్పకు మరింత ఖ్యాతి



ములుగు: హెరిటేజ్ ప్రొఫెసర్లతో కలెక్టర్



వెంకటాపురం(ఎం): వివరిస్తున్న సర్పంచ్..

ములుగు: యునెస్కో గుర్తింపుతో రామప్ప దేవాలయానికి మరింత ప్రఖ్యాతి లభించిందని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. మంగళవారం కలెక్టర్ కృష్ణ ఆదిత్య తన చాంబర్‌లో హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన అసోసియేట్ ప్రొఫెసర్ మోహన్ రాఘవన్ బృందంతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యునెస్కో గుర్తింపు తర్వాత పర్యాటకుల సంఖ్య పెరిగిందన్నారు. వ్యాపారపరంగానూ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కౌశిక్ గ్రోతి, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా టూరిజం గైడ్ శ్రీనివాస్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ పాల్గొన్నారు.

రామప్ప స్థితిగతులపై సర్వే

వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయం యునెస్కో గుర్తింపు పొందిన తర్వాత స్థానికులకు లభిస్తున్న ఉపాధి అవకాశాలపై మంగళవారం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డిపార్ట్ ఆఫ్ హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన అసోసియేట్ ప్రొఫెసర్ మోహన్ రాఘవన్ ఆధ్వర్యంలో బృందం రామప్పను సందర్శించింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ రామప్ప పరిస్థితులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డొలి రజిత శ్రీనివాస్ వారితో మాట్లాడారు. రామప్పను సందర్శించిన వారిలో ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ మోహన్ రాఘవన్ టీం, ఇండియా టూరిజం గైడ్ శ్రీనివాస్, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో శ్రీనివాస్ తదితులున్నారు.

సందర్శించిన ఫ్రాన్స్ దేశస్తులు

రామప్ప దేవాలయాన్ని ఫ్రాన్స్‌కు చెందిన పిలిప్స్, డెనిస్ దంపతులు సందర్శించారు. ఆలయ పూజారి హరీశ్‌శర్మ వారికి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. వారివెంట వచ్చిన నేషనల్ టూరిజం గైడ్ రాజా ఫ్రాన్స్ భాషలో రామప్ప ఆలయ విశిష్టతను వివరించారు.

కాంగ్రెస్‌ను గెలిపించి సోనియాకు బహుమతిగా ఇద్దాం

- కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కాజీపేట/మడికొండ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియాగాంధీకి బహుమతిగా ఇద్దామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం కాకతీయ యూనివర్సిటీ జంక్షన్‌నుంచి ప్రారంభమై గోపాలపురం క్రాస్‌రోడ్డు, సమ్మయ్యనగర్ మీదుగా గోకుల్‌నగర్, కలెక్టరేట్ నుంచి ఫాతిమానగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్న కేసీఆర్‌ను ఓడించాలన్నారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా పంట దిగుబడులను కోల్పోయి ఆచేతనంగా మిగిలిన రైతాంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో రాత్రి బస

భట్టి యాత్ర రాత్రి 9.30 గంటలకు మడికొండకు చేరుకుంది. వాసవిమాత కల్యాణ మంటపంలో రాత్రి బస చేశారు. బుధవారం ఉదయం 8 గంటలకు మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తారు. అక్కడినుంచి పాదయాత్ర ద్వారా మడికొండ చౌరస్తా, అంబేడ్కర్ విగ్రహం సెంటర్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరినుంచి ధర్మసాగర్ మండలానికి వెళ్తారని పార్టీ నేతలు తెలిపారు.

ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పాటుకు కేసీఆర్ కుట్ర

- ప్రభుత్వ యూనివర్సిటీల నిర్వీర్యం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- కేయూలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి
- కష్టాలు, సమస్యలు చెప్పుకున్న విద్యార్థులు



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కేయూ క్యాంపస్: కొట్లాడి, సాధించుకున్న తెలంగాణలో ఫ్యూడల్ వ్యవస్థను పునర్నిర్మించేలా కేసీఆర్‌కుట్ర చేస్తున్నాడని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో నిరుద్యోగ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తొలుత పలువురు నిరుద్యోగ విద్యార్థులు మాట్లాడుతూ తెలంగాణ వస్తే మాకు ఉద్యోగాలు వస్తాయని భావించామని కాని కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఉద్యోగాల భర్తీచేయలేదన్నారు. చివరికి ఇచ్చిన నోటిఫికేషన్లలో పేపర్ల లీకేజీతో పలు నోటిఫికేషన్లు రద్దుచేశారని అన్నారు. తాము కుటుంబాలకు దూరంగా ఉండి కష్టపడి చదుకుంటున్నామని యూనివర్సిటీల ప్రైవేటీకరణ, గ్రూప్ పేపర్ల లీకేజీ, గురుకుల పోస్టుల ఉద్యోగాల రిజర్వేషన్ల ఇబ్బందులు సమస్యలను విద్యార్థులు సీఎల్పీ నేత దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో కాకతీయ యూనివర్సిటీ ఒక పెద్ద వర్సిటీగా, ఎన్నో ఉద్యమాలకు, భావజాలాలకు, సామాజిక మార్పులకు వేదికగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవం లేకుండా 70 ఏళ్లనాటి ఫ్యూడల్ వ్యవస్థను పునరుద్ధరించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. నీళ్లు లేవు.. నిధులు లేవు.. నియామకాలు లేకుండా చేశారు. ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాలు, ప్రభుత్వరంగ సంస్థల్లోని ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదన్నారు. తెలంగాణ లక్ష్యాలు నెరవేరేవరకూ విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నర ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క యూనివర్సిటీని కూడా కొత్తగా ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్రను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ యూనివర్సిటీలను మాత్రం ఏర్పాటు చేస్తుందన్నారు. రూ.5లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ ప్రభుత్వం కేసీఆర్ ఇంకా కొనసాగితే రాష్ట్రంలోని యూనివర్సిటీల భూములను కూడా అమ్మేస్తాడని ఎద్దేవా చేశారు. త్వరలో టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి లేఖ రాస్తానని చెప్పారు. పేపర్ లీకేజీలు చేసినా.. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయడం లేదన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే పోడెం వీరయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ తదితరులు మాట్లాడారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్‌రావు, శోభ, రవళిరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో కేయూ విద్యార్థి జాక్ కన్వీనర్ పర్లపెల్లి శ్రీశైలం, ఆలువాల కార్తిక్, బొట్ల మనోహర్, బండి రాకేష్, డాక్టర్ తీగల ప్రేమ్ సుందర్, హెచ్ భగత్, డాక్టర్ గజ్జెల మల్లేశ్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, దేవరకొండ ఐలేష్, మధుకర్‌రావు, మంద నరేష్ ఇట్టబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కచ్చితమైన వాటా ఇవ్వాలి



గురుకులాల్లో ఉపాధ్యాయ పోస్టులలో 75శాతానికిపైగా మహిళలకే కేటాయించారు. పురుష అభ్యర్థులు నష్టపోతున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. వారి కోటా వారికి ఇవ్వాల్సిందే. అదే విధానాన్ని చట్టసభల్లో కూడా కేసీఆర్ అమలు చేయాలి.

- రాజశేఖర్, నిరుద్యోగ విద్యార్థి

రూ.5 భోజనం తింటూ చదువుతున్నాం



విద్యార్థుల లక్ష్యాన్ని కేసీఆర్ ప్రభుత్వం లక్షలకు అమ్ముకుంటోంది. రూ.5 భోజనం తింటూ.. చదువుకుని ఉద్యోగాలకు ప్రిపేరవుతున్నాం. రోస్టర్ పాయింట్లు చూస్తుంటే దడ పుడ్తోంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందే.. కానీ పురుషుల కోటా మాత్రం కచ్చితంగా అమలు చేయాలి.

- దోంగ్రూ కచ్రూ, నిరుద్యోగ విద్యార్థి

నిట్‌లో కొలువుల సంబురం



క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో దుర్గాప్రసాద్, ఎన్వీ.రమణారావు

- ఉద్యోగ సాధనకు నిట్ అక్షయపాత్ర
- టెక్ మహీంద్ర సీటీఓ దుర్గాప్రసాద్
- 268 కంపెనీల్లో 1,410 మందికి ఉద్యోగాలు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో కొలువుల సంబురం మంగళవారం అంబరాన్నంటింది. నిట్ వరంగల్‌కు చెందిన 1,410 మంది విద్యార్థులు 268 కంపెనీల్లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించారు. నిట్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అక్షయ క్యాంపస్ సెలక్షన్స్ సక్సెస్ మీట్‌ను టెక్ మహీంద్ర సీటీఓ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా ప్రారంభించి, మాట్లాడారు. తాను నిట్ వరంగల్‌లోనే బీటెక్ పూర్తి చేసి క్యాంపస్ సెలక్షన్స్‌లోనే ఉద్యోగం సాధించి నేడు టెక్ మహీంద్రా కంపెనీకి సీటీఓగా పని చేస్తున్నానని తెలిపారు. ఉత్తమ విద్యకు, అత్యుత్తమ ఉద్యోగ సాధనకు నిట్ వరంగల్ క్యాంపస్ అక్షయ పాత్ర లాంటిందని కొనియాడారు. నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు నిట్ వరంగల్ గౌరవాన్ని ప్రపంచానికి చాటాలని తెలిపారు. నిట్ విద్యార్థులకు అత్యుత్తమ విద్యతోపాటు క్యాంపస్ సెలక్షన్స్‌కు సీసీపీడీ(సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్) ద్వారా ఉద్యోగాలను అందించేందుకు ప్రపంచంలోని కంపెనీలు పోటీపడుతున్నాయని నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. నిట్ విద్యార్థుల ప్రతిభకు తార్కాణంగా నిట్‌కు చెందిన ఆదిత్య సింగ్ రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలక్ట్ అవ్వడమేనని అన్నారు. నిట్ క్యాంపస్ సెలక్షన్స్‌లో ఫుల్ టైం ఎంప్లాయీస్‌గా ఉద్యోగాలు సాధించిన 1,410 మంది విద్యార్థులకు సీసీపీడీ క్యాంపస్ సెలక్షన్స్ పత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీసీపీడీ హెచ్ డేవిడ్‌సన్, రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ విద్యాబోధనతోనే మంచి ప్యాకేజీ..



న్యూఢిల్లీలోని ఫరీదాబాద్ నుంచి నిట్ వరంగల్‌లో బీటెక్ సీఎస్ఈ కోసం వచ్చా. ఇక్కడి విద్యార్థుల పోటీతత్వంతో ప్రేరణ పొందాను. నిట్ అధ్యాపకుల ఉత్తమ బోధనతోనే క్యాంపస్ సెలక్షన్స్‌లో తోస్పాట్ బెంగుళూరుకు చెందిన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.88లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను.

- ఆదిత్య సింగ్, సీఎస్ఈ, రూ.88లక్షల ప్యాకేజీ

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ లక్ష్యం



నేను వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై స్టార్టప్ కంపెనీ ఏర్పాటు చేస్తాను. నిట్‌లో ఎంఎస్సీ మాథ్స్ పూర్తి చేశాను, పూనేలోని సిటీ బ్యాంక్‌లో రూ.12లక్షల వార్షిక ప్యాకేజీకి సెలెక్ట్ అయ్యాను. కంపెనీ పెట్టి మరింతమందికి ఉద్యోగాలివ్వడమే నా లక్ష్యం.

- తానీయా అగర్వాల్, ఎంఎస్సీ (మ్యాథ్స్), రూ.12లక్షల ప్యాకేజీ

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా..



నిట్ వరంగల్‌లో సీఎస్ఈ విభాగంలో బీటెక్ చదువుతున్న తరుణంలోనే సీసీపీడీ చొరవతో క్యాంపస్ సెలక్షన్స్‌కు ఎంపికయ్యాను. హైదరాబాద్‌కు చెందిన డీషా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా రూ.62.5లక్షల ప్యాకేజీకి ఎంపికవడం ఆనందంగా ఉంది.

- సుషీత్‌రెడ్డి, సీఎస్ఈ, రూ.62.5లక్షలు

యూఎస్‌లో మాస్టర్స్ చేస్తా..



యూఎస్‌లో మాస్టర్స్ చేయడమే నాలక్ష్యం. నిట్‌లో ఈఈఈ విభాగంలో బీటెక్ పూర్తి చేస్తూనే క్యాంపస్ సెలక్షన్స్‌లో పాల్గొన్నాను. మా ప్రొఫెసర్స్ గైడెన్స్‌లో హైదరాబాద్‌కు చెందిన క్వాల్‌కామ్ కంపెనీలో రూ.29.7లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికవడం సంతోషంగా ఉంది.

- రుచీరా, ఈఈఈ, రూ.29.7లక్షల ప్యాకేజీ

ఉపేందర్ మృతదేహంతో ధర్నా

- మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
- రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్
- విద్యుత్ శాఖ నుంచి రూ.5లక్షలు, ఒకరికి ఉద్యోగం ఇస్తామని ఎస్ఈ హామీ



మృతదేహంతో రాస్తారోకో నిర్వహిస్తున్న, బంధువులు, అఖిలపక్ష నాయకులు

గార్ల: విధి నిర్వహణలో భాగంగా విద్యుదాఘాతానికి గురై సోమవారం రాత్రి మృతిచెందిన వాంకుడోత్ ఉపేందర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట అఖిలపక్షం నాయకులు, కుటుంబ సభ్యులు మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో గార్ల నుంచి పోచారం వెళ్లే వాహనదారులకు మూడు గంటపాటు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు చేరుకుని జిల్లా విద్యుత్ శాఖ అధికారులను గార్లకు రప్పించారు. పరిహారం చెల్లింపుపై బాధిత కుటుంబ సభ్యులు అఖిలపక్షం నాయకులతో జిల్లా ఎస్ఈ నరేష్, డీఈ విజయ్, ఏడీఈ రమేష్‌లు కలిసి చర్చలు జరిపారు. విద్యుత్‌శాఖ నుంచి రూ.5లక్షలు, విద్యుత్ శాఖ ఇన్సూరెన్స్, ఈపీఎఫ్ నుంచి రూ.20లక్షలు, ఉపేందర్ కుమారుడికి కాంట్రాక్ట్ బిల్ కలెక్టర్ ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని జిల్లా ఎస్ఈ నరేష్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై బానోత్ వెంకన్న కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గార్ల సబ్‌స్టేషన్ ఎదుట ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ బాలాజీ నేతృత్వంలో ఎస్సైలు బానోత్ వెంకన్న, రమాదేవి పోలీస్ సిబ్బంది బందోబస్త్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నూనావత్ జ్యోతి, అఖిలపక్షం నాయకులు కందునూరి శ్రీనివాసరావు, కట్టిబోయిన శ్రీనివాసరావు, దనియాకుల రామారావు, మాలోత్ వెంకట్‌లాల్, భూక్యా నాగేశ్వరరావు, జంపాల వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనిపించని ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం

- హనుమకొండ, వరంగల్‌లో వంద శాతం హాజరు
- టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 90 శాతం హాజరు



ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మోహరించిన పోలీసులు

హన్మకొండ: హనుమకొండ, వరంగల్ జిల్లాలో విద్యుత్ ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్, ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇటీవల విద్యుత్ సంస్థల్లోని రెండు జేఏసీలతో వేతన సవరణ ఒప్పందంపై అసంతృప్తిగా ఉన్న ఈ రెండు యూనియన్లు యాజమాన్యాలకు సమ్మె నోటీసు ఇచ్చాయి. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో సమ్మెకు వెళ్లాయి. కానీ, ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. మరో వైపు విద్యుత్ సంస్థల్లో సమ్మెను నిషేధాన్ని విధించింది. ఆర్టిజన్‌లు సమ్మెకు వెళ్తే ఎస్మా కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించాయి. ఈ క్రమంలో సమ్మె సందిగ్ధంలో పడ్డది. ఎక్కడ ఎస్మా ప్రయోగించి చర్యలు తీసుకుంటారో.. ఎక్కడ ఉద్యోగాలు ఊడిపోతాయోననే భయాందోళన మధ్య బలవంతంగా ఆర్టిజన్లు హాజరయ్యారు. ప్రధాన సంఘాల మద్దతు లభించకపోవడం కూడా ఆర్టిజన్లు వెనక్కు తగ్గడానికి కారణమని పలువురు ఉద్యోగులు తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలో ఆర్టిజన్లు సమ్మెకు దూరంగా ఉన్నారు. ఈ రెండు జిల్లాలో వంద శాతం హాజరయ్యారని ఎన్పీడీసీఎల్ అధికారులు తెలిపారు. హనుమకొండ జిల్లాలో 189 మంది ఆర్టిజన్లు, వరంగల్ జిల్లాలో 183 మంది ఆర్టిజన్ ఉద్యోగులుండగా అందరు విధులకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. వంద శాతం హాజరుతో జిల్లాలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం చూపలేదు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగింది. కాగా, టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో 90శాతం ఆర్టిజన్లు విధులకు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో సమ్మె ప్రభావం కనిపించిందని తెలిపారు. ఇదిలా ఉండగా హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ భవన్‌కు పోలీసు పహారా ఏర్పాటు చేశారు. కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా వారి వివరాలు తెసుకున్నాకే లోపలికి అనుమతించారు.

బతుకుదెరువు కోసం వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో తాత మృతి, మనుమడికి గాయాలు



ప్రమాదస్థలిలో సైదులు మృతదేహం

దేవరుప్పుల : బతుకు దెరువు కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ తాత చనిపోగా, మనుమడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన తాతమనుమళ్లు చినబత్తుల సైదులు(75), తిరుపతి ఆయుర్వేద మందుల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలోనే మంగళవారం సూర్యాపేట– జనగామ రహదారి గుండా మహారాష్ట్రకు మారుతీ వ్యాన్‌లో వెళ్తుండగా సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలోని ధారావత్‌తండా పరిధిలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టారు. ఈ ఘటనలో సైదులు అక్కడికక్కడే మృతిచెందగా.. మనుమడు తిరుపతి కాళ్లు విరిగి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. సైదులు కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వరిధాన్యాన్ని కుప్పగా చేస్తూ కుప్పకూలిన రైతు

- చికిత్స పొందుతూ మృతి



వెంకట్‌రెడ్డి(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఆరబోసిన ధాన్యాన్ని వర్షానికి దగ్గరికి చేస్తుండగా కుప్పకూలి పడిపోయిన ఓ రైతు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన రిక్కల వెంకట్‌రెడ్డి(60) తన వరి ధాన్యాన్ని అమ్మేందుకు గ్రామంలోని ఐకేపీ కేంద్రానికి తరలించి ఎండకు ఆరబెట్టాడు. ఈనెల 23న(ఆదివారం) సాయంత్రం వర్షం రావడంతో ధాన్యాన్ని దగ్గరగా కుప్ప చేసే క్రమంలో ఒక్కసారిగా కుప్ప కూలాడు. గమనించిన తోటి రైతులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టండి



హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న స్పౌజ్ టీచర్లు

- హనుమకొండలో ర్యాలీ నిర్వహించిన టీచర్లు

విద్యారణ్యపురి: ఉమ్మడివరంగల్ జిల్లాలో ఇంకా బదిలీ కాని స్పౌజ్ టీచర్లు తమకు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్పౌజ్ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. 317 జీఓ ద్వారా భర్త ఒక జిల్లా.. భార్య మరొక జిల్లాలో ఉంటూ అనేక ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 16 నెలలుగా నిరీక్షిస్తున్నామని తమ ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ టీచర్లకు బదిలీలు చేసినప్పటికీ మిగిలిన అందరినీ బదిలీ చేయాలని కోరారు. అలాగే ఎస్జీటీ కేటగిరి స్పౌజ్ టీచర్లకు ఇప్పటివరకు బదిలీలు చేపట్టలేదని తమ ఆవేదనను ప్లకార్డుల వెలిబుచ్చారు. హనుమకొండలోని డీఈఓ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రంను సమర్పించారు. ఈసందర్భంగా స్పౌజ్ టీచర్ల ఫోరం బాధ్యులు కందగట్ల సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి తమ మాటను నిలుపుకోవాలని కోరారు. వేణుగోపాల్, శ్రీనివాసస్వామి, శ్రీహరి, శరత్, రాంగోపాల్‌రెడ్డి, హుస్సేన్, రమాదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, గౌసియా, హేమలత, శ్రీపాల్, నరిసయ్య, భాస్కర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- రైల్వే సంఘ్ సికింద్రాబాద్ డీఎస్ భుజంగరావు



నూతన కార్యవర్గం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డ్రైవర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ (డీఎస్) డి.భుజంగరావు అన్నారు. కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో మంగళవారం రైల్వే సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచీ 10వ జనరల్ బాడీ, నూతన కార్యవర్గం ఎంపికలో భుజంగరావు మాట్లాడారు. ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.రాఘవయ్య నేతృత్వంలో రైల్వే డ్రైవర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైల్వే బోర్డు స్థాయిలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే డీఎంఓ డాక్టర్ హరినాథ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో డ్రైవర్లు, అసిస్టెంట్ డ్రైవర్లు ఆరోగ్యంగా జాగత్తగా ఉండాలని పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రైల్వే సంఘ్ ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కె.రవి, వర్కింగ్ చైర్మన్‌గా పాక రాజ్‌కుమార్, వైస్ చైర్మన్లుగా శృతి, జి.లక్ష్మీయనారాయణ, గుప్తా, సెక్రటరీగా చింత మురళి, అసిస్టెంట్ సెక్రటరీలుగా జి.వరప్రసాద్ రెడ్డి, మేరుగు శివ, సీహెచ్.పరమేశం, ట్రెజరర్‌గా పి.సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ్ కేంద్ర కమిటీ సభ్యులు వి.మురళికృష్ణ, ఎస్.వెంకటనారాయణ, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.